క్లుప్తంగా

పూరీల త్రివర్ణం



త్రివర్ణ పతాకం రంగులో పానీపూరీ

నగరి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ పరిధి చావడి ప్రాంతంలో పానీ పూరీ విక్రయించే వ్యక్తి పూరీలను త్రివర్ణ పతాకం రంగుల్లో తీసుకురావడం ప్రత్యేకతను సంతరించుకుంది. దేశభక్తిని ఇలా కూడా చూపించవచ్చా అంటూ పలువురు చమత్కరించారు.

లింగేశ్వర స్వామివారికి ప్రత్యే పూజలు

నింద్ర: మండలంలోని ఎలకాటూరు గ్రామంలో ఉన్న పురాతన శ్రీకామాక్షి సమేత శ్రీబ్రహ్మ లింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గ్రామస్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న మునికృష్ణయ్య

పుత్తూరు: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏఎస్ఓగా పనిచేస్తున్న ఎస్.మునికృష్ణయ్య విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకొన్నారు. తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ ప్రశంసా పత్రాన్ని అందుకొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



భక్తులకు అన్నదానం చేస్తున్న పైనేని మురళీ

శ్రీరంగరాజపురం: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సోషల్ వర్కర్ పైనేని మురళీ ఆధ్వర్యంలో తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లిలో వెలసిన ఆరిమానిగంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటరమణ, రవి, లోకయ్య తదియరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల వితరణ



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

శ్రీరంగరాజపురం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకుని ముద్దుకుప్పం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్పిక్ అండ్ గ్రీన్ స్టార్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ సంస్థ నిర్వాహకులు బ్యాగులు, పుస్తకాలు వితరణ చేశారు. సంస్థ రాయలసీమ రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పాఠశాలల విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులు శ్రీను, గిరిబాబు, ఎంపీటీసీ సిద్ధయ్య, జిల్లా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గణేష్, వెంకటేష్, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆధ్వర్యంలో జెండా వందనం



జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న అధికారులు, ఉపాధి శ్రామికులు

తిరుపతి తుడా: పుత్తూరు రూరల్ మండలంలోని రామసముద్రం, అమృత సరోవర్‌లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు, ఉపాధి శ్రామికులు 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ అదనపు కార్యక్రమాధికారి టి.మమతారాణి మాట్లాడుతూ మన స్వేచ్ఛ, హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, వారి స్ఫూర్తితో దేశాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. సర్పంచ్ కుమారస్వామి, ఉపాధి శ్రామికులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జయహో.. భారత్



నగరి కోర్టులో జెండా ఎగురవేస్తున్న జడ్జి సి.జానకి



పుత్తూరు: జెండా వందనం చేస్తున్న జడ్జి రాఘవేంద్ర



వీరపాండ్య కట్టబొమ్మన్ వేషధారణలో అలరించిన విద్యార్థి

- వాడవాడలా రెపరెపలాడిన జాతీయ పతాకం

నగరి: జయహో భారత దేశమా అన్న నినాదం గ్రామగ్రామానా వినిపించింది. దేశభక్తి ప్రజ్వలించేలా అన్ని ప్రాంతాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్మన్ పీజీ నీలమేఘం జెండా ఎగురవేసి ఉత్తమ సేవలు అందించిన వారికి సర్టిఫికెట్లు అందించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ కోర్టులో పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి జెండా ఎగురవేయగా లాయర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్ వద్ద డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్, సీఐ విక్రమ్ జెండా ఎగురవేసి చిన్నారులకు చాక్లెట్లు పంచారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆర్డీఓ అనుపమ, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ రవికుమార్ జెండా ఎగురవేసి, అందరికీ స్వీట్లు పంచారు. తడుకుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వైస్ ఎంపీపీ కన్నియప్ప విద్యార్థులకు స్వీట్లు పంచారు. పాఠశాల కమిటీ అధ్యక్షుడు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఏరియా ఆస్పత్రి ఆవరణలో మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి జెండా ఎగురవేయగా, ఆర్ఎంఓ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ జెండా ఎగురవేయగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం మెడల్స్ బహుమతులు అందజేశారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో వచ్చిన విద్యార్థులు అందరినీ అలరించారు.

పుత్తూరు: స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే దేశాభివృద్ధికి మూలమని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక సబ్ కోర్టు ఆవరణలో జాతీయ జెండాను ఎగుర వేసి 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

మున్సిపల్ కార్యాలయంలో: చైర్మన్ హరి జాతీయ జెండాను ఎగుర వేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, సంఘ ప్రతినిదులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో: ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి జాతీయ జెండాను ఎగురవేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

స్వాతంత్ర్య సమరయోధుల అడుగుజాడల్లో నడుద్దాం

శ్రీరంగరాజపురం: స్వాతంత్ర్య సమరయోధుల అడుగుజాడల్లో నడుద్దామని ఎమ్మెల్యే థామస్ తెలిపారు. ఆయన శుక్రవారం మండల కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ ఎంతోమంది నాయకుల త్యాగ ఫలితంగా స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అదేవిధగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎంపీపీ సరిత, తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఏపీఎం రోజా, ఏపీవో లలితకుమారి, ఎస్ఐ సుమన్, ఎంఈవో అరుణాచలంరెడ్డి, సబర్మతి తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: మండలంలో సాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎంపీపీ లత, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనంజయవర్మ, డిప్యూటీ ఎంపీడీవో మధుసూదన్, ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌కుమార్, ఈవో నాగరత్నమ్మ ఆధ్వర్యంలో మువన్నెల జెండాను ఎగురవేశారు. మాజీ సైనికులను సన్మానించారు. సర్పంచ్ ధనుంజయవర్మ పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్‌లు వితరణ చేశారు. అలాగే కార్వేటినగరం సంస్థానాదీశులు స్వాతంత్ర్య సమరయోధులు రాజా వెంకట పెరుమాళ్‌రాజు, రాజా కుమారస్వామిరాజా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ కోదండ, జెడ్పీటీసీ దొరస్వామియాదవ్ జెండా ఎగురవేశారు. అదే విధంగా విద్యుత్ కార్యాలయం వద్ద ఏఈ తులసీప్రసాద్ జెండా ఎగురవేశారు. అలాగే అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లోనూ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకున్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ ఎస్ శ్యామల శివప్రకాస్ రాజు, జెడ్పీటీసీ అన్బలగన్, ఎంపీడీవో సతీష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ అరుణకుమారి, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, ఎంఈవో రాజేంద్రప్రసాద్, పీహెచ్‌సీ డాక్టర్ మోహన్‌క్రిష్ణ తమ కార్యాలయాల వద్ద స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించారు. శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం, ఆముదాల గ్రామ సచివాలయం వద్ద వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ గాలి మహేష్ బాబు, అయ్యప్ప అనురేఖ, ఎంపీటీసీ గోవింద రాజ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ గాలి మహేష్ బాబు గ్రీన్ అంబాసిడర్లకు దుస్తులు, టిఫిన్ బాక్స్‌లు అందజేశారు.

మదీనా మసీదులో..

నగరి: మదీనా మసీదు, మదర్సాలో ఈరోజు ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ సభ్యులు ఇ.మజీద్ ఇమామ్, గౌస్ బాషా, హ్యూమన్ రైట్స్ సలీమ్, అడ్వొకేట్ హనీఫా తదితరులు పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రమైన నింద్ర ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దీపా జాతీయ జెండాను ఎగురవేశారు. అదే విధంగా తహశీల్దార్ కార్యలయంలో తహశీల్దార్ శేషగిరిరావు, సీఐ కార్యాలయంలో సీఐ భాస్కర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: పచ్చికాపల్లంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నల్లవెంగనపల్లె, బొమ్మయ్యపల్లె, పెరుమాళ్లపల్లెలో సర్పంచులు, ఎంపీటీసీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తోకలము రశిరెడ్డి, సర్పంచులు శిల్ప, పుష్ప, గోవిందయ్య, కుమారి పాల్గొన్నారు.

జీడి నెల్లూరులో..

గంగాధరనెల్లూరు: ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ లక్ష్మీప్రియ, ఏవో లోకేష్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎమ్మార్సీలో ఎంఈవోలు ఆంజనేయులుశెట్టి, గుణశేఖర్ రెడ్డి, విద్యుత్ సబ్ స్టేషన్లలో ఏఈలు వరదరాజులు, తనిగవేలు జాతీయ జెండా ఎగురవేశారు. వీరకనెల్లూరులో స్వాతంత్ర్య సమరయోధుడు నారాయణరెడ్డి కుమారుడు విశ్వనాథరెడ్డిని మండల పరిషత్ అధికారులు శాలువా తో సన్మానించారు.









పుత్తూరు: సత్కారం అందుకొన్న మున్సిపల్ సిబ్బంది, పాలసముద్రం: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జెండా వందనం, పాలసముద్రం: ఎస్‌కేఆర్ పురం సచివాలయంలో జెండా ఎగురవేస్తున్న సర్పంచ్, వైస్ ఎంపీపీ









పెనుమూరు: ఎంపీడీఓ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ, పెనుమూరు: విద్యుత్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ, కార్వేటినగరం: పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం వితరణ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మసీదు కమిటీ సభ్యులు









తడుకుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు పంచుతున్న వైస్ ఎంపీపీ, విద్యార్థులకు చాక్లెట్లు పంచుతున్న తహశీల్దార్, జెండా వందనం చేస్తున్న డీఎస్పీ, జీడీనెల్లూరు: విశ్వనాథరెడ్డిని సన్మానిస్తున్న మండల పరిషత్ అధికారులు

ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోండి

కార్వేటినగరం: ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ తెలిపారు. ఆయన శుక్రవారం స్కంధ పుష్కరిణి వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే కుమారగిరిపై ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పుష్కరిణిలో ప్రమాదకరమైన ప్రాంతాల్లో కాకుండా భక్తుల కోసం ఏర్పాటుచేసిన ప్రాంతాల్లోనే స్నానం ఆచరించాలన్నారు. తెప్పోత్సవాలు జరిగే సమయంలో భక్తులు దూరంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాలు ముగిసే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులు, స్థానికులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట సీఐ హనుమంతప్ప, ఎండోమెంట్ ఈవో కృష్ణనాయక్ ఉన్నారు.



స్కంధ పుష్కరిణి వద్ద ఆడికృత్తిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్

నూతన దుకాణం ప్రారంభం

శ్రీరంగరాజపురం: మండలంలోని 49కొత్తపల్లిమిట్ట తిరుపతి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రానైట్, టైల్స్ దుకాణాన్ని వైఎస్ఆర్ సీపీ చిత్తూరు నియోజకవర్గం ఇన్‌చార్జి విజయానందరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రజలకు నాణ్యమై గ్రానైట్, టైల్స్‌ను తక్కువ ధరకు అందించాలని యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ విజయానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కోటిరెడ్డి బాబు, వైఎస్ఆర్ సీపీ జిల్లా క్రియాశీలక కార్యదర్శి విజయబాబు, సర్పంచులు రాజశేఖర్‌రెడ్డి, గోవిందయ్య, చెంగల్‌కొండరెడ్డి, నాయకులు సుధ, దేవరాజులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుకాణాన్ని ప్రారంభిస్తున్న వైఎస్ఆర్ సీపీ చిత్తూరు ఇన్‌చార్జి విజయానందరెడ్డి

భక్తి శ్రద్ధలతో భరణి కావళ్ల చెల్లింపు



సుబ్రమణ్య స్వామివారు

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణీ సమీపంలో కుమారగిరిపై వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో జరుగుతున్న ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భక్తులు భరణి కావళ్ల సమర్పించారు. వేకువ జామునే స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు భరణి కావళ్లతో ఆలయానికి చేరుకుని తలనీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామిని గ్రామంలో ఊరేగించారు.

కోలాహలంగా భరణి కావళ్లు

పాలసముద్రం: భరణి కావళ్ల చెల్లింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కావళ్లను శుభ్రంచేసి పసుపు, కుంకమ, చందనం, వివిధ పుష్పాలతో అలంకరించి పూజ గదిలో ఉంచి పూజలు చేశారు. టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పంబ వాయిద్యాలతో ప్రతి ఇంటి నుంచి కావళ్లు ఎత్తారు. అనంతరం తిరుత్తణికి వెళ్లారు. శ్రీకావేరిరాజు పురంలోనూ కావళ్ల తీసుకుని తిరుత్తణికి బయలుదేరారు.

ఉత్తమ సేవలకు సత్కారం









ఎస్ఐ సుమన్, సోషల్ వర్కర్ మునికృష్ణయ్య, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, ఎంపీడీఓ చంద్రమౌళి







చంద్రబాబు, చరణ్ హారతి

కార్వేటినగరం: చిత్తూరు జిల్లా ఉత్తమ ఎంపీడీవో చంద్రమౌళి, ట్రాన్స్‌కో ఏడీఈ చంద్రబాబు శుక్రవారం చిత్తూరులో కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వారు మాట్లాడుతూ ఉత్తమ అవార్డుతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. అదే విధంగా సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ కార్యదర్శి చరణ్ సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. కార్వేటినగరం జూనియర్ లైన్‌మన్ దినేష్ ఉత్తమ జేఎల్ఎంగా అవార్డు అందుకున్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండల ఎస్ఐ సుమన్, సోషల్ వర్కర్ ఎస్.మునికృష్ణయ్య రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్నారు.

ఎస్ఐ చిన్నరెడ్డెప్పకు ఉత్తమ సేవా అవార్డు

పాలసముద్రం: పాలసముద్రం ఎస్ఐ చిన్నరెడ్డెప్ప ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. చిత్తూరులో జరిగిన అవార్డుల ప్రదానంలో ఆయన ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. ఆయనను ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్‌కు ప్రశంసలు

పుత్తూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ టి.హారతి విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు శుక్రవారం రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. విజయవాడలో జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రశంసా పత్రాన్ని ఆమె అందుకున్నారు.

యువత రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకుడు

నగరి: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆలిండియా తౌహిద్ జమాత్, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి వారు కలిసి రక్తదాన శిబిరం నిర్వహించారు. బస్టాండు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ 19వ రక్తదాన శిబిరంలో 51 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారు సమస్త మానవ ప్రాణులను కాపాడిన వారవుతారన్న ప్రవక్త సందేశాన్ని అనుసరించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలిండియా తౌహిద్ జమాత్ వారు తెలిపారు. ప్రతి దాతకు ఒక మొక్కను ఇచ్చి దానిని నాటి పరిరక్షించాల్సిందిగా వారు సూచించారు. వీటితో పాటు పలు ప్రాంతాల్లో తౌహిద్ జమాత్ సభ్యులు మొక్కలను నాటారు.

ఆడికృత్తికకు ఘనంగా ఏర్పాట్లు

నగరి: ఆడి కృత్తిక ఉత్సవాలను నియోజకవర్గ ప్రజలు ఎక్కువగా ఆచరిస్తారు. ఇక్కడ నివశించే మొదలియార్ కులస్తుల్లో ఈ పండుగ ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. నగరి నుంచి కావళ్లతో వెళ్లే భక్తులు తిరుత్తణి కొండకు వెళ్లి మొక్కులు చెల్లించడం పరిపాటి. శనివారం ఆడికృత్తిక కావడంతో శుక్రవారం నుంచే భక్తులు పూజా సామగ్రి కొనుగోలు చేయడం ప్రారంభించడంతో బజారు ప్రాంగణం జనంతో నిండిపోయింది. పండుగ రోజు కావడంతో పూజాసామగ్రి ధరలకు రెక్కలు వచ్చాయి. పువ్వులు ఎక్కువ ధర పలికాయి. బజారు ప్రాంగణంలో కావళ్లు, పసుపు దుస్తులు, పువ్వుల విక్రయాలు ఊపందుకున్నాయి.

తిరుత్తణి టౌన్‌లోనే వాహనాలు

ఆడికృత్తికకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తుండడంతో తిరుపతి నుంచి నగరి మీదుగా తిరుత్తణి చేరుకునే బస్సులు, ఇతర వాహనాలు, బైక్‌లు బైపాస్ వద్దే ఆపేస్తున్నారు. దేవస్థానం వారు అందించిన క్యూఆర్ కోడ్ పాసులు ఉన్న వాహనాలను మాత్రమే కొండపైకి అనుమతిస్తున్నారు. బైపాస్‌లో వాహనాలు ఆపేసేవారు అక్కడి నుంచి ఆలయానికి నడిచి వెళ్లాల్సి ఉంది. అలాగే చిత్తూరు నుంచి తిరుత్తణికి చేరుకునే బస్సులను పీడబ్ల్యూడీ కార్యాలయం వద్ద ఆపేస్తున్నారు. అక్కడి నుంచి భక్తులు ఆలయానికి నడిచి వెళ్లాలి. కాగా తిరుత్తణిలో ఆడి భరణిని పురస్కరించుకొని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేక, దీపారాధనలు చేశారు. స్వామి వారిని బంగారు కవచం, వజ్రాల హారం, ముత్యాలహారం, మరకత హారాలతో అలంకరించారు. ప్రత్యేక పుష్పార్చనలు చేశారు.



బస్టాండు ప్రాంగణంలో కావళ్ల విక్రయాలు